PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :273 | పేజీలు : 8 | వెల రూ.5 | మంగళవారం 27.10.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్

Published From Rangareddy

Circulated by All Districts of Telangana and Andhra Pradesh

WANTED

ప్రభాత సూర్యుడు

www.prabhathasuryudu.com

రిపోర్టర్స్ కావలెను

తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.

కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

prabhathasuryudueditor@gmail.com

https://youtube.com/@PrabhathaSuryuduNews

70326 93467

WANTED REPORTERS



మహారాష్ట్ర సీఎంతో సుదీర్ఘ చర్చలు

తుమ్మిడిహెట్టిపై రేవంత్ బొరవ

- సానుకూలంగా స్పందించిన ఫడ్నవీస్
- 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి తెలంగాణ ప్రతిపాదన
- 148 మీటర్ల ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు మహారాష్ట్ర సీఎం సంసిద్ధత
- ఆదిలాబాద్ గిరిజనుల సాగు, తాగునీటి అవసరాలను వివరించిన రేవంత్
- ముంపు, నీటి లభ్యత, సాంకేతిక అంశాలపై అధ్యయనానికి అధికారుల కమిటీ
- మహారాష్ట్రలో ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధం

తెలంగాణలోని వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంతానికి సాగు, తాగునీటి సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక ముందడుగు వేశారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చలు జరిపారు. బ్యారేజీ ఎత్తును ప్రస్తుత ప్రతిపాదనలోని 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. అయితే, మహారాష్ట్రకు, అక్కడి ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదని, సాంకేతిక అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రభాత సూర్యుడు–హైదరాబాద్ ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ వివాదాన్ని పరిష్కరించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నిరంతర ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలోనే సోమవారం ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథి గృహంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కీలక భేటీ జరిగింది. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, అధికారులు పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి డిజైన్‌పై చర్చించారు. 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మించాలనే తెలంగాణ ప్రతిపాదనపై చర్చించారు. 152 మీటర్ల ఎత్తులో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనం, ముంపును వివరాలతో సహా సీఎం రేవంత్‌రెడ్డి నివేదించారు. పరిహారం, పునరావాసంపై అధికారుల నివేదిక గురించి మహారాష్ట్ర సీఎంకు వివరించారు. 148 మీటర్ల ఒప్పందాన్ని పరిశీలించేందుకు సిద్ధమని ఫడ్నవీస్ తెలిపారు. మహారాష్ట్రకు నష్టం లేకపోతే తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపు అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు 152 మీటర్ల ఎత్తు అవసరమని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ముంపు భూములకు మహారాష్ట్ర నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదిలాబాద్ గిరిజనుల సాగు, తాగునీటి అవసరాలను వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై అధ్యయనానికి అధికారుల కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల అధికారుల అధ్యయనం తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఫడ్నవీస్‌ను రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు.

₹100 ఇంధనానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్..

₹20 వాహనదారులకు బిగ్ రిలీఫ్!.



ప్రభాత సూర్యుడు– ఢిల్లీ : పర్యావరణ పరిరక్షణ, దేశీయ ఇంధన లభ్యతను ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరొక కీలక నిర్ణయం తీసుకుంది. 100 శాతం వరకు ఇథనాల్ కలిపిన పెట్రోల్‌తో నడిచే ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలను అనుమతిస్తూ కేంద్ర మోటారు వాహనాల నిబంధనలలో మార్పును కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది. ప్రముఖ వాహన తయారీ సంస్థలు తమ ₹100 మోడళ్లను మార్కెట్లోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్న తరుణంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కొత్త నిబంధనల ద్వారా ఉద్గార ప్రమాణాల చట్రంలో ₹85 ఇంధనంతో పాటు ₹100 కు సమాన హోదా లభించింది. ఈ ఏడాది ఏప్రిల్ 27న విడుదల చేసిన ముసాయిదా నిబంధనలపై ప్రజలు, నిపుణుల నుంచి వచ్చిన సలహాలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ తుది నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది.

₹20 వాహనాలకు ఎలాంటి మార్పు అవసరం లేదు:

ప్రస్తుతం ₹20 ఇంధనాన్ని వినియోగిస్తున్న వాహనదారులకు కేంద్రం కీలక స్పష్టత ఇచ్చింది. ₹85, ₹100 ఇంధనాలు ప్రత్యేకంగా వాటి కోసం రూపొందించి, ధ్రువీకరించిన వాహనాలకు మాత్రమే ఉద్దేశించినవని అధికారులు వెల్లడించారు. సాధారణ పెట్రోల్ లేదా ₹ 20 ఇంధనంతో నడిచే వాహనాల్లో ₹85, ₹100 ఇంధనాలను వినియోగించడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే రోడ్డుపై తిరుగుతున్న వాహన యజమానులు ₹85 లేదా ₹100 ఇంధనానికి మారాల్సిన అవసరం లేదని తెలిపారు. భవిష్యత్తులోనూ ఈ ఇంధనాల కోసం తమ వాహనాలను మార్చుకోవాలని లేదా ప్రత్యేక మార్పులు చేయించుకోవాలని ఈ నోటిఫికేషన్ సూచించడం లేదని వివరించారు.

ఖర్గే వ్యాఖ్యల దుమారం..

దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల నిరసనలు



ప్రభాత సూర్యుడు–ఢిల్లీ : ప్రధాని మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఖర్గే తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలంటూ కమలనాథులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఆదివారం బిహార్‌లోని పట్నాలో ఓ కార్యక్రమానికి హాజరైన మల్లికార్జున ఖర్గే.. 'మోదీ కాదు.. ఆయన బాబైనా పోవాల్సిందే' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కాషాయ పార్టీ నాయకులు కాంగ్రెస్ అధ్యక్షుడిపై భగ్గుమన్నారు.ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయాల్లో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేశారు. అలాగే ఆయన పోస్టర్లకు నిప్పంటించి, వ్యతిరేక నినాదాలు చేశారు. బిహార్‌లో కమలనాథులు ఆందోళనలు నిర్వహించి, కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీకి ఖర్గే బహిరంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ వివాదంపై బీజేపీ అగ్ర నాయకులూ స్పందించారు. ఖగ్గేను కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా విమర్శించారు. 'ఇది చాలా బాధాకరం. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం ఏంటంటే.. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్‌లో చిన్న స్థాయి వ్యక్తి చేయలేదు. ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

నష్టం మీ వల్లే కదా.. గోదావరి జలాలపై దుష్ప్రచారం ఎందుకు?: ఎంపీ చామల



ప్రభాత సూర్యుడు–హైదరాబాద్ తెలంగాణకు గోదావరి జలాల వినియోగంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన నీటిమట్టమే లేదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 93.5 మీటర్ల నీటిమట్టం ఉంటేనే నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుందని.. ప్రస్తుతం 89 మీటర్ల ప్రవాహమే ఉందని వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దగ్గరా ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. మరోవైపు, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను 299 టీఎంసీలకు పరిమితం చేసే ఒప్పందానికి నాడు బీఆర్ఎస్ ప్రభుత్వమే అంగీకరించిందని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రానికి నష్టం చేసిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు గోదావరి జలాలపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ గోదావరి జలాలను వినియోగించుకుంటున్నామని స్పష్టం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. అదేవిధంగా ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఎంపీ తెలిపారు.

ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు: హరీశ్‌రావు



ప్రభాత సూర్యుడు– హైదరాబాద్ : తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్లు తెస్తామంటున్నారనీ, అదే నిరూపిస్తే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్లు తేవడం కుదరదని తేలితే ఉత్తమ్ రాజీనామా చేస్తారా? అని సవాల్ విసిరారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి బృందం.. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను కలిసిన నేపథ్యంలో.. హరీశ్‌రావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు."తెలంగాణ కంటే ఏపీలో వర్షపాత లోటు ఎక్కువ. అలాంటిది.. ఇక్కడ క్రాప్ హాలీడే ఎందుకు ఉంది? ఏపీలో ఎందుకు లేదు? దేవాదుల వద్ద పంపులు నడిపి ఉంటే వరంగల్ జిల్లాకు కరవు ఉండేది కాదు. శ్రీశైలంలో నీళ్లు ఉన్నా ఎందుకు ఎత్తిపోయలేదు. కల్వకుర్తిలో ఐదు మోటార్లున్నా రెండు మోటార్లే నడుపుతున్నారు. అది కూడా రెండు గంటలే నడుపుతున్నారు. శ్రీశైలం నుంచి ఏపీ తీసుకెళ్తున్నదెంత? తెలంగాణ తీసుకొస్తున్నదెంత? దేవాదుల, కల్వకుర్తి పంపుల వాడకంపై శ్వేతపత్రం విడుదల చేయాలి. కన్నెపల్లి వద్ద నీళ్లను అవకాశం ఉన్నా ఎందుకు ఎత్తిపోయలేదు. ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరవే. ఇవాళ సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రకు వెళ్లారు. మేం 2014లో ప్రభుత్వంలోకి వచ్చిన 42 రోజుల్లోనే ఆ రాష్ట్రంతో చర్చలు జరిపాం. కానీ, రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల తర్వాత చర్చలు జరిపారు. మూడేళ్లు కాలయాపన చేసి ఇప్పుడు మహారాష్ట్ర వెళ్లారు" అని హరీశ్‌రావు అన్నారు.

మీ బాధను అర్థం చేసుకుంటా..

ఢిల్లీ వ్యాపారులకు రాహుల్ హామీ



ప్రభాత సూర్యుడు–ఢిల్లీ :ఢిల్లీలో ప్రతి వ్యాపారికీ అండగా ఉంటానని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారు. ఢిల్లీ వ్యాపారుల బాధను అర్థం చేసుకుంటున్నామని ఎక్స్‌లో ఆయన హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం మెట్రో సేవలను నిలిపివేసి, రహదారులను మూసివేసి, దేశ రాజధాని ఢిల్లీని దిగ్బంధం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఓటు చోరీ జరిగితే ఏదీ సురక్షితం కాదన్నారు. 'మీ (వ్యాపారులు) దుకాణం, మీ పొదుపు, మీ పిల్లల భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడతాయి. ఓటుచోరీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నేను విజ్ఞప్తి చేస్తున్నా. ఆయనను తొలగిస్తే 30 సెకన్లలోనే ఆందోళనలు ఆగిపోతాయి' అని రాహుల్ పేర్కొన్నారు.

బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



బడంగ్‌పేట్ – ప్రభాత సూర్యుడు: మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య మాట్లాడుతూ మహర్షి వాల్మీకి భారతీయ సాహిత్యంలో ఆదికవిగా ప్రసిద్ధి చెందారని పేర్కొన్నారు. ఆయన రచించిన రామాయణం సమాజానికి ధర్మం, నీతి, సత్యం, మానవతా విలువలను బోధించే మహోన్నత గ్రంథమని తెలిపారు. వాల్మీకి అందించిన అపారమైన సాహిత్య సేవలు చిరస్మరణీయమని, ఆయన బోధనలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ డి. కిష్టప్ప, డిప్యూటీ ఇంజనీర్లు కే. హరిణి, బి. రూపతో పాటు సర్కిల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని మహర్షి వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ట్రంక్ లైన్ డ్రైనేజీ పనులు ప్రారంభం



తట్టి అన్నారం – ప్రభాత సూర్యుడు:తట్టిఅన్నారం నుంచి ఆర్.కె. నగర్ మీదుగా మర్రిపల్లి వరకు చేపట్టనున్న ట్రంక్ లైన్ డ్రైనేజీ మొదటి దశ పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం ఆర్.కె. నగర్ నుంచి పనులు ప్రారంభించగా, స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఢిల్లీ మాధవ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ డ్రైనేజీ లైన్ పూర్తయితే ఆయా ప్రాంతాల్లో మురుగునీటి పారుదలకు మెరుగైన సదుపాయం కలుగుతుందని స్థానికులు ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక చొరవతో ఇప్పటివరకు రూ. 10 కోట్ల నిధులు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు నిధులను కూడా సమకూర్చేందుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రగోని గోవర్ధన్, కాటెపాక మల్లేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడు: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన పోలమోని శ్రీశైలం, ఆయన తండ్రి పోలమోని లింగయ్య 20 రోజుల వ్యవధిలో మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఒకే కుటుంబంలో తక్కువ వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ. 20,000 ఆర్థిక సాయం అందజేసి, వారికి అండగా నిలిచారు. క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి సహాయం అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం.. చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



గౌరెల్లి – ప్రభాత సూర్యుడు:మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నాగోల్ సర్కిల్ పరిధిలోని తారామతిపేట్ తారకరామా నగర్ కాలనీ, గౌరెల్లి క్రాస్‌రోడ్ సమీపంలో అక్రమంగా సెట్‌బ్యాక్ లేకుండా కమర్షియల్ భవన నిర్మాణం చేపడుతున్నారని గ్యార నరసింహ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. రహదారిపై భారీ లారీలు రాకపోకలు సాగించే నేపథ్యంలో ఈ నిర్మాణం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు, ద్విచక్ర వాహనదారుల భద్రత దృష్ట్యా అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రహదారి వెంట ప్రభుత్వం నాటిన పది చెట్లను నిర్మాణదారుడు తొలగించినట్లు ఫిర్యాదులో పేర్కొంటూ, ఈ అంశంపై కూడా విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం


రైతులకు సాగునీరు ఇవ్వకుండా.. పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా మోసం చేస్తున్న ప్రభుత్వం

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ నాయకులు



ప్రభాత సూర్యుడు– సిద్దిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఎద్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, కాముని శ్రీనివాసులు విమర్శించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్లు కోల రమేష్ గౌడ్, నల్ల నరేందర్ రెడ్డి, ములకల కనకరాజు, నాయకులు రవీందర్ రెడ్డి, ప్రభాకర్ వర్మలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం సేకరించక పోవడంతో వారి కష్టార్జితం దళారుల పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తే తప్ప కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే పరిస్థితి లేదని విమర్శించారు. రెండు, మూడు రోజుల క్రితం వరకు వ్యాపారులు క్వింటాల్ ధాన్యాన్ని రూ. 2,400 చొప్పున కొనుగోలు చేయగా, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో ప్రస్తుతం రూ. 1,800కే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, సాగునీరు లేక పంట దిగుబడులు తగ్గాయని ఆరోపించారు. అష్టకష్టాలు పడి పండించిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం రైతులను మరింత ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. రైతు భరోసా అందించడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు, రైతు బీమా పథకాన్ని అమలు చేయడంలోనూ ప్రభుత్వం విఫలమైందని, రుణమాఫీ సక్రమంగా చేయలేదని విమర్శించారు. విద్యుత్ సరఫరా సైతం సరిగా ఉండటం లేదని, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే దానిని పునరుద్ధరించడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతుల వంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో నాయకులు కీసర పావయ్య, బెదురు తిరుపతి, కాముని ఉమేష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫామ్‌హౌస్‌లో యువకుడి అనుమానాస్పద మృతి



ఘట్‌కేసర్ – ప్రభాత సూర్యుడు: మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఏదులాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో జరిగిన పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఉప్పల్ భగాయత్‌కు చెందిన రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సి. ప్రవీణ్ కుమార్ కుమారుడు కృష్ణ కౌండిన్య (21) మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ కౌండిన్య నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాడు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం సుమారు 7.30 గంటలకు తన స్నేహితుడు ఘన్‌కోట్ రిషబ్‌తో కలిసి ఏదులాబాద్‌లోని 'లివిన్ ఫామ్‌హౌస్'లో నిర్వహిస్తున్న మరో స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. మరుసటి రోజు, అక్టోబర్ 25న ఉదయం 10 గంటల సమయంలో రిషబ్ తండ్రి మృతుని తండ్రి ప్రవీణ్ కుమార్‌కు ఫోన్ చేసి, కృష్ణ కౌండిన్య ఫామ్‌హౌస్‌లో అపస్మారక స్థితిలో పడిపోయాడని, అతడిని ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం ఇచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకోగా, అప్పటికే కృష్ణ కౌండిన్య మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని ప్రవీణ్ కుమార్ అదే రోజు మధ్యాహ్నం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, యువకుడి మృతికి దారితీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఇతర ఆధారాల ఆధారంగా మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

బొట్టుగూడ వాల్మీకి నగర్‌లో ఘనంగా మహర్షి వాల్మీకి ప్రకటోత్సవ వేడుకలు

నల్లగొండ – ప్రభాత సూర్యుడు: నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడ వాల్మీకి నగర్‌లో ఉన్న వాల్మీకి దేవాలయంలో ఆదికవి మహర్షి వాల్మీకి ప్రకటోత్సవ వేడుకలను సోమవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు.ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, రామాయణం వంటి మహాకావ్యాన్ని ప్రపంచానికి అందించిన మహర్షి వాల్మీకి ఆశయాలు, ఆయన బోధించిన ధర్మమార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. బస్తీ ప్రజలందరూ ఐకమత్యంతో, సోదరభావంతో మెలగడమే మహర్షి వాల్మీకి ఆశయాలకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.వేడుకల్లో భాగంగా బి. ఓంపాల్ సౌజన్యంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి. రాంపాల్, బి. ఓంపాల్, సిహెచ్. అల్బేలా, సిహెచ్. పాండు, పి. మురారి, పి. రవి తదితరులు పాల్గొన్నారు. బస్తీకి చెందిన యువకులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం: డాక్టర్ హేమలత

సేవాభారతి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం..
40 మందికి పైగా యువకుల స్వచ్ఛంద రక్తదానం



నల్లగొండ– ప్రభాత సూర్యుడు: రక్తదానం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నల్లగొండ జిల్లా చైర్మన్ డాక్టర్ హేమలత అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్ సెంటర్‌లో సేవాభారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ, అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల పలువురు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నవారు రక్తదానంపై అపోహలను వీడి, వైద్యుల సూచనల మేరకు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. యువత రక్తదాన శిబిరాల్లో పాల్గొని సామాజిక బాధ్యతను చాటుకోవాలని సూచించారు.సేవాభారతి జిల్లా అధ్యక్షుడు కందుల శిరీష్ మాట్లాడుతూ, తమ సంస్థ ఆధ్వర్యంలో రక్తదానం, విద్యా, వైద్య సేవలతో పాటు పర్యావరణ పరిరక్షణ తదితర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా ఫిర్యాదులపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

పోలీస్ గ్రీవెన్స్ డేలో 45 ఫిర్యాదుల పరిశీలన
బాధితులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ శరత్ చంద్ర పవార్.. నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు



నల్లగొండ – ప్రభాత సూర్యుడు:నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సుమారు 45 ఫిర్యాదులను పరిశీలించారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు తదితర అంశాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, చట్ట పరిధిలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడం, బాధితులకు సత్వర న్యాయం కల్పించడం, పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడమే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎస్పీ తెలిపారు.

మాదిగల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గం

మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు

నల్లగొండ– ప్రభాత సూర్యుడు: మాదిగలు ఐక్యంగా పోరాడితేనే



అధికారం, హక్కులు సాధించుకోగలరని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు అన్నారు. సోమవారం నల్లగొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.తెలంగాణలో సుమారు 70 లక్షల మంది మాదిగలు వివిధ రంగాల్లో వెనుకబడి, కుల వివక్ష, అవమానాలు, దాడులను ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు అందలేదని అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా మాదిగలంతా ఏకమై తమ ఐక్యతను పాలకులకు చాటాలని పిలుపునిచ్చారు. త్వరలో వేలాది మందితో మాదిగల మహాశక్తి ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు.ఎస్సీ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దున్న యాదగిరి, పెరిక కరణ్ జయరాజు, శ్రావణ్, పెరిక రమేష్, పరిదల నవీన్, కాప్పోలు అశోక్, మాచర్ల సైదులు, పెరిక అంజయ్య, కత్తుల సన్నీ, చింత శివరామకృష్ణ, మామిడి బాలయ్య, కొప్పోలు విమలమ్మతో పాటు వివిధ కుల సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నామినేషన్లకే అడ్డంకులా.. ఇదేం ప్రజాస్వామ్యం!

దాడులు, బెదిరింపులు, పత్రాల లాక్కోవడంపై ప్రజాగ్రహం

అధికార పార్టీదే ఆధిపత్యమా? ఎన్నికల అధికారులు ఏం చేస్తున్నట్లు?

ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలి.. ఘటనలపై సమగ్ర విచారణ జరపాలి

ప్రభాత సూర్యుడు–పోరుమామిళ్ల :స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై మండల ప్రజల్లో తీవ్ర అనంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్యానికి పునాది కావాల్సిన ఎన్నికల ప్రక్రియలోనే అడ్డంకులు, బెదిరింపులు, దాడులు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలే ఎన్నికల ప్రక్రియను తమకు అనుకూలంగా మలుచుకోవాలని చూస్తున్నారా? ఇతర పార్టీల అభ్యర్థులకు నామినేషన్ వేసే అవకాశం కూడా లేకుండా చేస్తున్నారా? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. నామినేషన్ వేయడమే నేరమా? ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి అర్హుడైన అభ్యర్థికి రాజ్యాంగబద్ధమైన హక్కు. కానీ నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులను అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను లాక్కోవడం, దాడులకు పాల్పడడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అధికార పార్టీ అభ్యర్థులే బరిలో ఉండాలన్న ధోరణి ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవా లను అధికారులు నిష్పక్షపాతంగా తేల్చాల్సిన అవసరం ఉంది.అధికార పార్టీ నేతల మధ్యే ఆధిపత్య పోరా? ప్రజలకు సేవ చేయాల్సిన రాజకీ య నాయకులు పదవుల కోసం, ఆధిపత్యం కోసం పరస్పరం పోటీ పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీలోని నాయకుల మధ్యే విభేదాలు, ఆధివత్య పోరు కొనసాగుతుంటే, దాని ప్రభావం సామాన్య ప్రజలపై పడుతోందని స్థానికులు అంటున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా దిగజా రుతున్నారన్న ఆరోపణలు ప్రజల్లో అనహనాన్ని పెంచుతున్నాయి.ఎన్నికలకు ముందే ముడుపుల ఆరోప్ణలు!ఎన్నికల ప్రక్రియ మూర్తికాకముందే ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల నుంచి కొందరు నాయకులు ముడుపులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, బాధితుల వాంగ్మూలాలు, అధికారిక విచారణ ద్వారా వాస్తవాలు నిర్ధారించాల్సి ఉంది. ఎన్నికల ముందే ఇలాంటి ఆరోపణలు వస్తుంటే, గెలిచిన తర్వాత ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తారన్న ప్రశ్నను స్థానికులు లేవనెత్తుతున్నారు. రాజకీయ పదవులు ప్రజాసేవ కోసమా? లేక పెట్టుబడికి ప్రతిఫలం పొందే మార్గమా? అని వారు ప్రశ్నిస్తున్నారు.అధికారుల మౌనం ఎందుకు?నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద అభ్యర్థులకు భద్రత కల్పించడం, నామినేషన్లు స్వేచ్ఛగా దాఖలు చేసేలా చూడడం ఎన్నికల యంత్రాంగం బాధ్యత. అభ్యర్థులను అడ్డుకుంటున్నారన్న ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు తక్షణమే స్పందించారా? పోలీసుల సమక్షంలో నే ఘటనలు జరిగాయా? నామినేషన్ పత్రాలు లాక్కున్నా రన్న ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించాలిరాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా వివాదాలు, దాడులు, అడ్డంకులకు సంబంధించిన ఆరోపణలు వచ్చిన ప్రాంతాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఘటనపై స్పష్టమైన నివేదికలు తెప్పించి, సీసీటీవీ దృశ్యాలు, వీడియో ఆధారాలు, బాధితుల ఫిర్యాదులను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై పార్టీ భేదం లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజాస్వామ్యం అంటే అధికార పార్టీకి మాత్రమే హక్కులు ఉండటం కాదు. ప్రతిపక్ష అభ్యర్థికి కూడా పోటీ చేసే అవకాశం ఉండాలి. ఓటరుకు తన ఇష్టానుసారం ఓటు వేసే స్వేచ్ఛ ఉండాలి. నామినేషన్ నుంచి పోలింగ్ వరకు ప్రతి దశలోనూ నిష్పక్ష పాతంగా ఎన్నికలు నిర్వహించడమే ఎన్నికల వ్యవస్థకు అసలైన పరీక్ష. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలతో పాటు అధికార యంత్రాంగంపైనా ఉంది. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ స్పందించి, ఆరోపణలకు ముగింపు పలికి, ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ నెల 28న ఐఎఫ్ డబ్ల్యూజే వ్యవస్థాపక వేడుకలు

ప్రభాత సూర్యుడు–మంచిర్యాల : ఈనెల 28వ తేదీన మంచిర్యాల



జిల్లా కేంద్రంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే) వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు జరుగు తాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి మధు, ప్రధాన గడ్డం సత్య గౌడ్, అక్రిడేషన్ కమిటీ మెంబర్ కామెరా వెంకటస్వామిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని మైక్రో కంప్యూటర్ సెంటర్లో ఈనెల 28న ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులను సన్మానించడం జరుగుతుందన్నారు. 1950 అక్టోబర్ 28న ఢిల్లీలో ఎంతోమంది సీనియర్ పాత్రికేయులు స్థాపించిన తొలి పాత్రికేయుల యూనియన్ అయిన ఐఎఫ్ డబ్ల్యూజే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో విస్తరించి జర్నలిస్టు హక్కుల కోసం పోరాడుతుందని పేర్కొన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈనెల 28న దేశవ్యాప్తంగా వ్యవస్థాపక వేడుకలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో కూడా వేడుకలు జరుపుతున్నామని తెలిపారు. జర్నలిస్టులు ఫెడరేషన్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొమురం భీం చేసిన పోరాటం చిరస్మరణీయం

మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, దనసరి సీతక్క



ప్రభాత సూర్యుడు–ఆసిఫాబాద్ : ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం పోరాడిన అమరుడు కొమురం భీం త్యాగం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మహిళా--శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. కొమురం భీం 86వ వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ, గిరిజనుల ఆరాధ్య దైవమైన అమరజీవి కొమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరుస్తామని తెలిపారు. రాబోయే బడ్జెట్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంబంధిత జీఓల అమలుకు పూర్తి స్థాయి అధికారిక ఉత్తర్వులు త్వరలో జారీ చేసే బాధ్యతను గిరిజన సంక్షేమ శాఖ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఐటీడీఏలకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడతామని అన్నారు. గిరిజనుల అటవీ సమస్యలను పరిష్కరిస్తూ ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన గిరిజనులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ‘‘జల్, జంగల్, జమీన్’’ కోసం పోరాడిన వీరుడు కొమురం భీం ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కొమురం భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సమ్మక్క--సారలమ్మ, బిర్సా ముండా వంటి మహనీయుల పోరాట స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.యువత విద్యపై దృష్టి సారించి ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో సుమారు 8 వేల ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు లభించిందని, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, ఇళ్లు, తాగునీరు, విద్యుత్, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పర్యాటక అభివృద్ధికి రూ.5 కోట్లు, రహదారుల అభివృద్ధికి రూ.180 కోట్లతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎంపీ జి. నగేష్ మాట్లాడుతూ కొమురం భీం ఆదివాసీల ముద్దుబిడ్డ, జాతిరత్నమన్నారు. జల్, జంగల్, జమీన్ కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని గిరిజన ప్రాంతాల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎస్టీఎఫ్‌డీ, జన్‌మన్, ఆర్టికల్ 275(1) తదితర కేంద్ర నిధులను గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించాలని కోరారు. ఆసిఫాబాద్, నిర్మల్, కాగజ్‌నగర్, ఖానాపూర్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్, వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన యోధుడు కొమురం భీం ఆశయాల సాధనకు కృషి చేయాలని అన్నారు. గిరిజన గ్రామాల్లో రహదారులు, రవాణా, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ హరీత మాట్లాడుతూ కొమురం భీం పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులను పరిరక్షిస్తూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి నిరంతరం తాగునీరు అందించేందుకు కెరమెరి సమీపంలో రూ.60 కోట్లతో ఇంటెక్‌వెల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.ఎన్పీ నిఖితా వంత్ మాట్లాడుతూ.. కొమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, పిల్లలను చదివించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఐటీడీఏ పీఓ మంద మకరందు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గోండి భాషలో ప్రసంగిస్తూ గిరిజన ప్రజలను ఆ కట్టుకు న్నారు. కార్యక్రమంలో గుస్సాడీ, చిన్నారుల సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచా యి. కార్యక్రమంలో భాగంగా మంత్రులు లబ్ధిదారులకు ఇంది రమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అం దజేశారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ల్యాప్ టాప్‌లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో కొమురం భీం మనుమడు కొమురం సోనే రావు, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ జోయల్, ప్రజాప్రతినిధులు, గిరిజన ప్రజలు, వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి రామాయణం ప్రపంచానికే ఆదర్శం

కొమురం భీమ్ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

భాజపా జిల్లా అధ్యక్షుడు – నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్



ప్రభాత సూర్యుడు–మంచిర్యాల :వాల్మీకి మహర్షి రచించిన రామాయణం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, ‘జల్--జంగల్--జమీన్’ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ స్ఫూర్తి అందరికీ ఆదర్శమని భాజపా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం మంచిర్యాలలోని భాజపా జిల్లా కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మోర్చాల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి, కొమురం భీమ్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివాసీల హక్కుల సాధన కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గం అశోక్ మాట్లాడుతూ వాల్మీకి, కొమురం భీమ్ సేవలు, పోరాటాలు తరతరాలకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తుల ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి రాకేష్ రెన్సా, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నిక ఏదైనా గెలుపు మనదే చైర్ పర్సన్ సామినేని సుజాత

ప్రభాత సూర్యుడు– మధిర ఎన్నిక ఏదైనా గెలుపు మనదేనని మధిర



గడ్డపై మరోసారి ఘనంగా నిరూపించాలని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, శాసనమండలి మాజీ సభ్యులు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ పొట్ల నాగేశ్వరరావులతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను పట్టభద్రులకు వివరించాలని సూచించారు.నవంబర్ 6 లోపు అర్హులైన ప్రతి పట్టభద్రుడి చేత ఓటరు నమోదు పూర్తి చేయించేందుకు నాయకులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

భూ- రీ సర్వే పేరుతో భూ సమస్యలు పరిష్కరించరా,

రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్న అధికారులు,ప్రజావాణిలో ఇచ్చిన వినతి పత్రాలకు పరిష్కారం ఎప్పుడు,

ప్రభాత సూర్యుడు– ఎర్రుపాలెం: భూ –రీ సర్వే పేరుతో రెవిన్యూ శాఖ అధికారులు పెండింగ్ లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించడం లేదని లిసిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావులి ఆరోపించారు.ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు నిర్వహిస్తున్న ప్రజావాణి లో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులతో కలిసి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారి శారదకు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగులో ఉన్నరైతుల భూ సమస్యల పరిష్కారానికి భూ రీ సర్వేకు లింకు చేసి సమస్యల నుండి అధికారులు తప్పించుకోవడమేనని విమర్శించారు. ఎన్ని సంవత్సరాలకు భూ రీ సర్వే పూర్తి చేస్తారు? ఎప్పటికీ రైతుల పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తారో చెప్పాలని ప్రశ్నించారు.




సంవత్సరాల తరబడి రైతులు చెప్పులు అరిగేలాగ తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, భూ రీ సర్వేకు సంబంధం లేకుండా రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజావాణిలో పరిష్కారం కొరకు ప్రజలు ఇచ్చిన ఏ ఒక్క దరఖాస్తు పరిష్కరించలేదని విమర్శించారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరు కారని సమస్యలు పరిష్కారం కావని పనికిమాలిన ప్రజావాణి దండగని ప్రజల విమర్శిస్తున్నారని అన్నారు.ప్రజావాణి కార్యక్రమం లేకపోతే సోమవారం అధికారులు తమ కార్యాలయంలో ఉండి ప్రజలకు పనైనా చేసి పెడతారని అన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజావాణిలో ఇచ్చిన ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కొండేపాటి గురవయ్య ఉన్నం శ్రీనివాసరావు, శివయ్య, గాలి సాహెబ్, బేజ్జం నాగమల్లేశ్వరావు,తదితరులు పాల్గొన్నారు.

చిత్రసీమ

ఖుషీ కపూర్ ఫ్యాషన్ సెన్స్

స్టైల్‌కు ఫిదా అవుతున్న నెటిజన్లు

బాలీవుడ్ యువ నటి ఖుషీ కపూర్ తన ప్రత్యేకమైన ఫ్యాషన్ సెన్స్‌తో మరోసారి ఆకట్టుకున్నారు. ప్రముఖ ఇటాలియన్ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ వాలెంటినో ముంబైలో నిర్వహించిన ప్రత్యేక దీపావళి వేడుకలో ఆమె స్టైలిష్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆదిత్య రాయ్ కపూర్, దయానా పెంటి, ఫాతిమా సనా షేక్, డినో మోరియా తదితర బాలీవుడ్ ప్రముఖులు పాల్గొన్న ఈ వేడుకలో ఖుషీ తన ఆధునిక, క్లాసిక్ గ్లామర్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ వేడుకలో ఆమె ధరించిన బ్లాక్ క్రాప్ జాకెట్ ప్రత్యేకంగా నిలిచింది. ముందు భాగంలో శాటిన్ బో, షీర్ ప్యానెల్‌తో రూపొందించిన ఈ జాకెట్‌కు సాఫ్ట్ ఫెదర్ కఫ్స్ అదనపు ఆకర్షణగా నిలిచాయి. దీనికి జతగా క్రీమ్ కలర్ కాలమ్ స్కర్ట్, బ్లాక్ ఎంబెల్లిష్డ్ వాలెంటినో బ్యాగ్, పెర్ల్ డ్రాప్ ఇయర్‌రింగ్స్‌తో ఖుషీ ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపించారు. స్లీక్ అప్‌డో హెయిర్‌స్టైల్, గ్లోయింగ్ మేకప్‌తో ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయ పండుగ వాతావరణానికి ఆధునిక ఫ్యాషన్ హంగులు జోడించిన ఖుషీ లుక్ నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది. విభిన్నమైన స్టైలింగ్‌తో ఫ్యాషన్ ప్రియులను తనదైన గుర్తింపును చాటుకుంటున్నారు.



రాశీ స్టన్నింగ్ లుక్

స్టైలిష్ లుక్‌తో కట్టిపడేస్తున్న బ్యూటీ
మోడ్రన్ గ్లామర్‌తో సోషల్ మీడియాలో సందడి

టాలీవుడ్‌లో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ రాశీ ఖన్నా మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆమె చేసిన స్టూడియో ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పూర్తిగా నలుపు రంగు దుస్తుల్లో ఆధునిక హంగులతో కనిపిస్తూ తనదైన స్టైల్‌ను ప్రదర్శించారు. తెల్లని నేపథ్యంతో రూపొందించిన స్టూడియో ఫొటోషూట్‌లో రాశీ ఖన్నా నలుపు రంగు షీర్ ప్యానెల్ హాల్టర్ బాడీసూట్ ధరించారు. దీనికి జతగా చక్కగా కుట్టిన బ్లాక్ ట్రౌజర్స్‌ను ఎంచుకున్నారు. సింపుల్‌గా కనిపించే ఈ కాంబినేషన్ ఆమెకు ఆధునిక, క్లాసీ లుక్‌ను అందించింది. కెమెరా ముందు హుందాగా కూర్చుని, తన జుట్టు మెలికను చేతితో తిప్పుతూ ఇచ్చిన పోజు ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సూక్ష్మమైన బ్రాంజ్డ్ మేకప్, స్పష్టంగా కనిపించే కళ్ల అలంకరణతో రాశీ ఖన్నా లుక్ మరింత ఆకట్టుకునేలా ఉంది. భారీ ఆభరణాలు, అదనపు అలంకరణలకు ప్రాధాన్యం ఇవ్వకుండా సింపుల్ స్టైలింగ్‌తోనే తన అందాన్నీ హైలైట్ చేశారు. ఆమె సహజమైన పోజులు, ఆత్మవిశ్వాసంతో కూడిన హావభావాలు ఫొటోలకు ఆధునిక గ్లామర్‌ను జోడించాయి.



ట్రెడిషనల్ లుక్‌లో అనుపమ పరమేశ్వరన్

క్లాసిక్ పోజులతో ఆకట్టుకుంటున్న మలయాళ కుట్టి



టాలీవుడ్‌లో తనదైన నటన, అందంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మరోసారి సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. తాజాగా ట్రెడిషనల్ దుస్తుల్లో ఫొటోషూట్‌కు పోజులిచ్చిన ఆమె, ఆ ఫొటోలను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. విభిన్నమైన లుక్‌తో పాటు పోజులతో ఆకట్టుకుంటూ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. సాధారణంగా సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తూ అభిమానులను అలరించే అనుపమ.. ఈసారి క్లాసిక్ లుక్‌లో మెరిశారు. స్టైలిష్ దుస్తులను ఎంచుకుని, ఆత్మవిశ్వాసంతో కెమెరా ముందు పోజులిచ్చారు. ఆమె లుక్‌లో కనిపించిన కొత్తదనం, ఫొటోలకు ఇచ్చిన ప్రత్యేకమైన పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తన ఫ్యా షన్ సెన్స్‌తో అనుపమ మరోసారి చర్చలో నిలిచారు. తాజా ఫొటోలు నెట్టింటికి చేరడంతో అభిమానులు వాటిని ఆసక్తిగా వీక్షిస్తున్నారు. అనుపమ అందం, స్టైలింగ్‌పై నెటిజన్లు స్పందిస్తున్నారు. సినిమాల్లో సహజమైన నటనతో ప్రేక్షకులకు దగ్గరైన ఈ ముద్దుగుమ్మ, సోషల్ మీడియాలోనూ తన ఫొటోషూట్లతో అభిమానులను అలరిస్తుంటారు. ఎప్పటికప్పుడు కొత్త లుక్స్‌తో కనిపిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

బీచ్ లుక్‌తో మైమరిపిస్తున్న బ్యూటీ

- సమ్మర్ ఫ్యాషన్‌లో గ్లామరస్ టచ్
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రాయ్ లక్ష్మి ఫొటోలు

దక్షిణాది సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి రాయ్ లక్ష్మి తన తాజా బీచ్ ఫొటోతో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. నీలిరంగు సముద్రపు నీటి అందాల మధ్య, గొడుగు నీడలో సేదతీరుతూ ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. సమ్మర్ వెకేషన్‌కు తగ్గట్టుగా ఎంచుకున్న ప్రత్యేకమైన అవుట్‌ఫిట్‌లో రాయ్ లక్ష్మి ఎంతో గ్లామరస్‌గా కనిపిస్తున్నారు. ఈ ఫొటోలో రాయ్ లక్ష్మి పసుపు, బంగారు రంగుల కలయికతో రూపొందించిన సీక్విన్స్ మోనోకిని ధరించారు. మెరుస్తున్న డిజైన్‌తో పాటు ప్రత్యేకమైన కట్‌అవుట్స్, స్ట్రాపీ డీటైలింగ్ ఈ అవుట్‌ఫిట్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. సముద్రపు నీలి రంగు నేపథ్యానికి ఆమె ధరించిన ఎల్లో గోల్డ్ దుస్తులు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. సూర్యకాంతిలో మెరిసే ఈ లుక్‌కు ఆమె ఎంపిక చేసుకున్న ఫ్యాషన్ యాక్సెసరీస్ చక్కగా సరిపోయాయి. టెక్స్చర్డ్ స్ట్రా హ్యాట్, రిఫ్లెక్టివ్ సన్ గ్లాసెస్‌తో రాయ్ లక్ష్మి తన బీచ్ స్టైల్‌కు మరింత ప్రత్యేకతను జోడించారు. తక్కువ ఆభరణాలతోనే అందాన్ని హైలైట్ చేస్తూ సింపుల్ అండ్ స్టైలిష్ లుక్‌ను ప్రదర్శించారు. సహజమైన సన్‌కిస్డ్ గ్లోతో ఆమె ఇచ్చిన పోజులు ఫొటోలకు మరింత ఆకర్షణను తెచ్చాయి. రిసార్ట్ ఫ్యాషన్‌లో బోల్డ్ స్టైలింగ్ ఎలా ఉండాలో తన లుక్‌తో చూపించారు. ఫొటోల్లో రాయ్ లక్ష్మి చూపించిన ఆత్మవిశ్వాసం, గ్లామర్, ప్రత్యేకమైన ఫ్యాషన్ సెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. వెకేషన్ ఫ్యాషన్‌లో కొత్తదనాన్ని కోరుకునేవారికి ఆమె తాజా లుక్ ఒక స్టైలిష్ ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తోంది.



హెచ్‌టీ సిటీ కవర్ షూట్‌లో మనుషి చిల్లర్ మెరుపులు

లిగెంట్ అవుట్‌ఫిట్స్‌తో ప్రత్యేక ఆకర్షణ

అందం, అభినయంతో పాటు ప్రత్యేకమైన ఫ్యాషన్ శైలితో ఆకట్టుకునే నటి, మాజీ ప్రపంచ సుందరి మనుషి చిల్లర్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో వార్తల్లో నిలిచింది. తాజాగా హెచ్‌టీ సిటీ కపర్ షూట్‌కు సంబంధించిన ఫొటోలను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. ఈ ఫొటోల్లో పాతకాలపు అందాలను గుర్తుచేసే వింటేజ్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. డాల్‌హౌస్‌లోని బొమ్మలా సున్నితమైన రూపంతో, హుందాగా కనిపిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంది. ఈ ఫొటోషూట్‌లో మనుషి ఎంచుకున్న దుస్తులు, క్లాసిక్ ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ విభిన్నమైన స్టైలింగ్‌తో కనిపించినప్పటికీ, ఆమె సహజమైన అందం మాత్రం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. పాతకాలపు ఫ్యాషన్ శైలిని ప్రతిబింబించే దుస్తులకు సంప్రదాయ ఆభరణాలను జోడించడంతో ఈ ఫొటోలకు ప్రత్యేకమైన రూపం వచ్చింది. హంగులు ఆర్భాటాలకు దూరంగా, సింపుల్ లుక్‌లోనూ అందంగా కనిపించవచ్చని మనుషి తన స్టైలింగ్‌తో చూపించింది. ఫొటోల్లో ఆమె ముఖంలో కనిపించే ప్రశాంతత, సహజమైన హావభావాలు ప్రతి చిత్రానికి ప్రత్యేక తను తీసుకొచ్చాయి. ఎలాంటి కృత్రిమ హంగులు లేకుండా తనదైన

- సహజమైన అందంతో అభిమానులను ఆకట్టుకుంటున్న భామ

శైలిలో కెమెరా ముందు కనిపిస్తూ ఆకట్టుకుంది. ఆధునిక ఫ్యాషన్ ప్రపంచంలో ట్రెండ్స్‌కు అనుగుణంగా మారుతూనే, తన సహజత్వాన్ని కాపాడుకోవడం మనుషి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోవడంతో అభిమానులు ఆమె లుక్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. సంప్రదాయపు ఛాయలు, ఆధునిక అందాల కలయికతో మనుషి ఫొటోషూట్ సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది.



Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryuduedit or@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555